# గతి!

రాత్రి చిత్తుగా తాగొచ్చింది చాలక, ప్రొద్దున్నే 'హేంగోవర్ పెగ్' కి తయారయినందుకు తారాస్థాయిలో లేచింది తారామణి. భార్యామణి తాకిడికి తట్టుకోలేక తా(రోడ్డు మీదికొచ్చి పడ్డాడు తాండవకృష్ణ.

జన్మలో మొదటిసారిగా ఆలోచించడం మొదలుపెట్టాడు. నిజమే! తను రేసులకి, తాగుడికి, సిగరెట్లకీ రోజూ ఎంత తగలేస్తున్నాడు. ఈ సొమ్మంతా జాగ్రత్తగా దాస్తే - నాల్గేళ్ళలో పిల్ల పెళ్ళి చెయ్యాలి. దర్జాగా చెయ్యొచ్చు గదా! ఒక పక్క ఇలా అనుకుంటూనే వున్నాడు, ఇంకో పక్క నుంచి సిగరెట్ తాగాలనే ఊహ, అతనికి తెలియకుండానే అతని చేతిని జేబులోకి నెట్టేసింది. సిగరెట్ తీసి నోట్లో పెట్టాడు. అదే క్షణంలో ఓ చెయ్యి ముష్టి విప్పి కళ్ళముందుర కనబడింది. దాని తాలూకు కంఠం, "రెండ్రోజులైంది సార్, అన్నం తిని, ఏదైనా ధర్మంచైండి సార్ ఆకలేస్తుంది" అని వినిపించింది.

ప్రమత్తంగానే, లేక అలవాటయిన చిలిపితనం మూలంగానే వాడి చేతిలో ఓ సిగరెట్ వెయ్యబోయాడు తాండవకృష్ణ.

వాడు చెయ్యి వెనక్కి తీసుకుని, "ఇంత అన్నం పెట్టించండి సార్, మీకు పుణ్యముంటుంది" అన్నాడు.

"ఏమిటి? సిగరెట్ త్రాగవా?" సిగరెట్ వెలిగిస్తూ సాశ్చర్యంగా అన్నాడు తాండవ.

"అలవాటు లేదు సార్"

కాస్సేపు నిదానించి వాడికేసి చూశాడు తాండవ. చదువుకున్న వాడిలా కనిపిస్తున్నాడు. సిగరెట్ అలవాటు లేదంటాడేమిటి? "సర్లే పద! సరదాగా అలా బార్ కెళ్దాం" అని ఆహ్వానించాడు.

"ఆకలేసి ఛస్తుంటే, బార్ ఏమిటి బాబు!" అన్నాడు వాడు దీనంగా.

"అక్కడ ఫుడ్ కూడా పెడ్తారోయ్" అన్నాడు దమ్ములాగుతూ తాండవకృష్ణ.

"అయితే వస్తాను సార్! కాని మందు తాగలేను సార్!" ఖరాఖండిగా చెప్పాడు.

నిర్ఘాంతపోయి దీర్ఘంగా చూడసాగాడు వాడికేసి, కొంతసేపాగి వాడికేసి జాలిగా చూస్తూ , "పోనీ... రేసులైనా ఆడావా ఎప్పుడైనా?" అన్నాడు.



"నన్నెందుకు సార్ పరీక్షిస్తారు? నాకలాంటి అలవాట్లేమీ లేవు. నిజంగా చాలా ఆకలిగా వుంది సార్! రేసులకి, లాటరీలకి తగలేస్తానని అనుమానంగా వుంటే, డబ్బులొద్దు సార్, ఇంత అన్నం పెట్టించండి చాలు. మీ పేరు చెప్పుకుని బతుకుతాను" దీనాతిదీనంగా వుంది వాడి గొంతు.

తాండవకృష్ణకేదో తళుక్కుమంది. వెంటనే ఓ నిర్ణయానికొచ్చి "ఆల్‌రైట్ పద"! అని వాణ్ణి వెంటపెట్టుకుని ఇంటికి తీసుకొచ్చాడు.

తారామణికి విషయం వివరించి, "వాడికి అన్నం పెట్టగలవా?" అని అడిగాడు.

ఆశ్చర్యపోయింది తారామణి ఎవరో గ్రహాంతరవాసిని చూసినట్టుగా కాస్సేపు భర్తని నిదానించి చూసింది అతని ముఖం చాలా మామూలుగా వుంది.

ఆకలిగొన్నవాడిని ఇంటికి పిలిచి మరీ అన్నం పెట్టేంత సద్బుద్ధి భర్తకి కలిగినందుకు తెగ ఆనందపడిపోయింది. సంతోషంగా వాడికి అన్నం పెట్టింది. వాడు ఆ దంపతులిద్దర్నీ మనసారా దీవించి వెళ్ళిపోయాడు.

చేతులు కొంగుకి తుడుచుకుంటూ "ఏం మహానుభావా! హఠాత్తుగా ఇంత సద్బుద్ధి కలిగించి తమకు? ప్రొద్దుటి నా ఉపన్యాసం పన్జేయలేదు కదా కొంపదీసి?" అంటూ భర్తకి దగ్గరగా వచ్చింది.

"లేదు" కళ్ళు మూసుకుని సమాధానం చెప్పాడు తాండవకృష్ణ. "సిగరెట్లూ, మందూ, రేసులూ ఇత్యాది అలవాట్లేమి లేని వాడి గతి ఎలా వుంటుందో నీకు ఒక్కసారి చూపిద్దామని చేశానంతే" అని గిరుక్కున వెనక్కి తిరిగాడు. వంకరతోక ఆడించుకుంటూ పెంపుడుకుక్క తాండవకృష్ణకి, తారామణికి మధ్య అల్లరి చేయసాగింది.